క్లుప్తంగా

ఓపన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిరుపయోగంగా ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఓపన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఇండోర్ ఆవరణలో అధునాతన జిమ్ సెంటర్‌ను మరో వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. స్కేటింగ్ రింక్‌లో చేయాల్సిన మార్పులను సూచించారు. అవుట్‌డోర్ మైదానంలో మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ పాల్గొన్నారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: మహాశివరాత్రి సందర్భంగా



అన్నదానం చేస్తున్న విశ్రాంత హెచ్ఎం బాలయల్లారెడ్డి

తన తండ్రి కల్లూరు చిన్న యల్లారెడ్డి జ్ఞాపకార్థం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కల్లూరు బాల యల్లారెడ్డి ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, సీటీఓ నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు చిన్నపురెడ్డి, మానవత సంస్థ సభ్యులు రాటాల గోపీ, కృష్ణా రెడ్డి, అవటాల రామాంజులరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కేటాయించిన వక్ఫ్ బోర్డు స్థలాల్లో నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గూడూరులోని 3.24 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన రూ.కోట్లాది రూపాయల వక్ఫ్ బోర్డు ఆస్తులు తప్పుడు పత్రాలతో పరులపాలు అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి అక్రమణదారుల నుంచి భూములను స్వాధీనం పరుచుకొని నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ భూమి సర్వేలో ప్రభుత్వ వక్ఫ్ బోర్డులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వక్ఫ్ ఆస్తుల జాబితాలో చేర్చాలన్నారు. ఇన్సాఫ్ నాయకులు గౌస్, షాజహాన్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపాలి

– ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా 10లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల విలీనం కోసం సేకరిస్తున్న వివరాలను తక్షణం ఆపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప ఏపీటీఎఫ్ కార్యాలయం వేదికగా ఆదివారం జిల్లాశాఖ సమావేశాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి రాష్ట్ర విద్యాశాఖ చేపట్టబోతున్న పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో దాదాపు 177 పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉందని అన్నారు. దీంతో గ్రామీణ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని వారు కోరారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు



చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కడప రాయుని కల్యాణ వైభోగం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, కృష్ణమోహన్, త్రివిక్రమ్ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదేవేరులతో సహా స్వామి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణ పీఠంపై కొలువుదీర్చారు. కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అనంతరం స్వామి పక్షాన అమ్మవార్ల గళసీమల్లో అలంకరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు కల్యాణ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వధూవరులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు, కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. రాయచోటికి చెందిన డీజే మణి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్ రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: తిరుపతి నగరంలో ఇటీవల నిర్వహించిన తైక్వాండో సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించడంపై ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం కడప నగరంలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు సౌత్‌జోన్ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎస్ఆర్ఐ ట్రస్టు చైర్మన్ తోటకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులకు ట్రస్టు తరపున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, తైక్వాండో శిక్షకుడు కొన్నిపాటి వెంకటేష్, కృష్ణవంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు..

బంగారు పతకాలు సాధించినవారు : వెంకటలక్ష్మి, కె.స్నేహశ్రీ,ఎస్. ఫాజిల్‌బాషా, ఎం.మహేష్‌బాబు, హేమంత్‌కుమార్, కె. రేవంత్‌రెడ్డి, జె. అక్షయ్‌కుమార్, జి. గంగన్న.

రజత పతకం సాధించినవారు : కె. వెంకటసుప్రజ, ఎస్. పవన్, ఎం. చంద్ర.

కాంస్యపతకాలు సాధించినవారు: నాగేంద్ర, ఆదర్శ్.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. ఆదివారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజిలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఉద్యోగులకు మూడు డీఏలు ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదని తెలిపారు. 2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన డీఏలను ఇంత వరకు చెల్లించలేదని తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి విజయానికి ఏపీటీఎఫ్ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రామదస్తగిరిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు గోపినాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గురయ్య, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు

– ప్రథమ బహుమతి సాధించిన ప్రొద్దుటూరు ఎద్దులు



జనసందోహం నడుమ జరుగుతున్న పోటీలు

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 1808.01 అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దులు 1680 అడుగులు లాగి ద్వితీయ స్థానం, నందలూరుకు చెందిన హబీబుల్లా ఎద్దులు 1465.08 అడుగులు లాగి తృతీయ స్థానం, వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన చిట్టిబోయిన భరత్ కుమార్ ఎద్దులు నాలుగో స్థానం, సింహాద్రిపురం మండలం చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎద్దులు ఐదోస్థానం, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్ సిద్దారెడ్డి నాగసుబ్బారెడ్డి ఎద్దులు ఆరో స్థానం, దొరసానిపల్లెకు ఎద్దులు ఏడో స్థానాలల్లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు పలువురు ఔత్సాహికులు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఓబుళరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న దిన్నెపాటి గంగమ్మతల్లి తిరుణాల సందర్భంగా మంగళవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సుంకర వెంకటనారాయణ తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఒంగోలు గిత్తల చే బండ లాగుడు పోటిలు ఉంటాయన్నారు. మొదటి బహుతిరూ.80 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు. రాత్రి సమయంలో జ్యోతుల కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈఈఎంటీ ప్రతిభా పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

మైదుకూరు : ఉపకార వేతనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టెస్ట్) ప్రతిభా పరీక్షలో మైదుకూరు మున్సిపాలిటీలోని కేశలింగాయపల్లెకు చెందిన విద్యార్థిని పసల వీర ఉదయశ్రీ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహిస్తుంది. ఏడవ తరగతి చదివే వారు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 10వ తరగతి వరకు ఏడాదికి రూ.20వేలు ఉపకార వేతనం పొందుతారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈఈఎంటీ పరీక్షలో ప్రతిభ చాటి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల హెడ్‌మాస్టర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

26న జిల్లాస్థాయి హిందీ ప్రతిభ పరీక్ష

రాజంపేట టౌన్: పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి టెన్త్ విద్యార్థులకు హిందీ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు 6303701314 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు

పాహిమాం.. వీరబ్రహ్మేంద్రస్వామి



మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న బ్రహ్మంగారు



వీఎన్‌పల్లె: సంగమేశ్వర సన్నిధిలో కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : 'పాహిమాం.. వీరబ్రహ్మేంద్ర స్వామి' అంటూ భక్తులు శరణు వేడారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మఠానికి తరలివచ్చారు. బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మోహినీ అలంకారోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం ప్రత్యేక పూజలనంతరం స్వామి వారు మోహినీ అలంకారంలో పుర వీధుల్లో విహరించారు. మధ్యాహ్నం నామ సంకీర్తన, భజన (పారాయణ) కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి నంది ఉత్సవం ఉత్సాహంగా సాగింది. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వాముల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవింద స్వామి, వరదరాజులస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ వారు, మఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, ఉభయదాతలు నెల్లూరు జిల్లా నార్సురాజుపాళెంకు చెందిన బద్వేలి రమణారెడ్డి, దేవమ్మ, మద్రాసుకు చెందిన కన్నయప్పన్, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఈశ్వరీదేవి మఠంలో.. ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ఆవాహిత సర్వదేవతా షోడశోపచార పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి, దేవతోద్వాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోరుమామిళ్ల భగవాన్ రమణమహర్షి భక్త బృందం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు చెప్పిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. అనంతరం ఈశ్వరీదేవి సింహవాహన సేవను నిర్వహించారు. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాముల ఆధ్వర్యంలో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టారు. ఉభయ దాతలు సుంకు సురేష్‌బాబు, వరలక్ష్మి, నాగజశ్వంత్, శశాంక్, నెల్లూరుకు చెందిన వొమ్మెన పెద్ద ఈశ్వరయ్య, శోభాదేవి, మురళీకృష్ణ, భార్గవి పాల్గొన్నారు.

ఘనంగా శివ, పార్వతుల కల్యాణం

వీరపునాయునిపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో ఆదివారం ఉదయం 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యశర్మ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను తేరుపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సంగమేశ్వరాలయంలో రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కరుణాకర్‌రెడ్డి దంపతులు, సంగమ్మ దంపతులు, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ రోజారమణి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ బ్రహ్మానందరెడ్డి, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశ్వేశ్వర్‌రెడ్డి, రెడ్డిరాధ, ఉమ, వినయ్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఎస్పీ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, సీఐ సత్యబాబ పాల్గొన్నారు.

కూరగాయ ధరలు పైపైకి!



కడప రైతు బజార్

కడప అగ్రికల్చర్: కూరగాయల ధరలు మళ్లీ మెల్లగా ఎగబాకుతున్నాయి. దీంతో సామాన్యులపై ఆర్థికంగా భారం పడనుంది. మొన్నమొన్నటి వరకు కిలో టమాట పది రూపాయలు ఉండగా ప్రస్తుతం 25 రూపాయలకు చేరుకుంది. దీంతో పేద, మధ్య తరగతి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. మిగతా కూరగాయల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. మన ప్రాంతంలో టమాట సీజన్ తగ్గడంతోపాటు మదనపల్లె, గుర్రంకొండ ప్రాంతాల నుంచి టమాటాలను రైతుబజార్‌కు దిగుమతి చేసుకోవడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. దీంతోపాటు ఇతర కూరగాయలైన బీన్స్, క్యాప్సికమ్ కూడా కిలో రూ. 50 ధర ఉంది. అలాగే క్యారెట్, బెండకాయ, కాలిఫ్లవర్, బీరకాయ, బజ్జి మిరపకాయలు కిలో రూ. 40 ధర పలుకుతున్నాయి. కందగడ్డ, చామగడ్డలు కూడా కిలో రూ. 40 పలుకుతున్నాయి. అనపకాయ, మట్టికాయలు కిలో రూ. 35 ఉండగా బంగాళాదుంప కిలో రూ.36 ఉన్నాయి. కాకరకాయ, అలసందలు, దొండకాయ, ముల్లంగి, బీట్రూట్ కిలో రూ. 30 ధర ఉంది. ఆకు కూరల ధరలు కూడా సామాన్యులకు భారంగానే ఉన్నాయి.

జై భవానీ.. జయహో శివాజీ!



శోభాయాత్రలో పాల్గొన్న నగర మేయర్ సురేష్‌బాబు

- ఘనంగా మరాఠీల శోభాయాత్ర

కడప కల్చరల్ : కడప మరాఠీమండలి మహరాష్ట్ర మఠం కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. మరాఠా యోధుడు శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబా భవానీ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మాసీమ సర్కిల్, వన్‌టౌన్, ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండు, రవీంద్రనగర్ మీదుగా తిరిగి ర్యాలీ ఆలయం వద్దకు చేరుకుంది. నగర మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు పాకా సురేష్, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఉత్సాహ పరుస్తూ సాగారు. శివాజీ చిత్రాలు గల కండువాలు, పేటాలు, టోపీలు, పతాకాలు ధరించిన మరాఠాలు దారి పొడవునా ర్యాలీలో జై భవాని, జయహో శివాజీ, శివాజీ మహరాజ్‌కీ జై అంటూ కదం తొక్కారు. దాదాపు ప్రతి కూడలిలో కొద్దిసేపు ఆగి ప్రత్యేకంగా నినాదాలు చేశారు.

జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ

కడప స్పోర్ట్స్: జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా, ఏపీ ఒలంపిక్ సంఘం పరిశీలకులుగా విచ్చేసిన శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎన్.వి.పి. అమృత్‌రా ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. న్యాయ పరిశీలకులుగా ఎస్. షామ్స్ తబ్రేజ్ వ్యవహరించారు. అనంతరం వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఒలంపిక్ సంఘం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షుడిగా సమరనాథరెడ్డి

జిల్లా ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడుగా కె.ఎస్. సమరనాథరెడ్డి(స్క్వాష్) ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు చైర్మన్‌గా టి. సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాయబ్ రసూల్, టి. జనార్దన్, కోశాధికారిగాసాయికిశోర్, ఈసీ మెంబర్లుగా ప్రిన్స్ ఐజాక్, అశ్వర్థలను ఎన్నుకున్నారు.

మరమ్మతులకు గురైన రైల్వే గేటు



రైల్వేగేటు వద్ద ఆగిపోయిన వాహనాలు

కమలాపురం : పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటు ఆదివారం మరమ్మతులకు గురి కావడంతో నాగులు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం 10 గంటల సమయంలో రైల్వే గేటు మరమ్మతులకు గురైంది. పట్టణం నుంచి క్రాస్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. అల్లాడుపల్లె తదితర శైవ క్షేత్రాలకు వెళ్లి తిరుగుముఖం పట్టిన ప్రయాణీకులు నాలుగు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. క్రాస్ రోడ్డు వైపు నుంచి ఖాజీపేట, మైదుకూరు తదితర ప్రాంతాలకు వెళ్లే లారీలు, బస్సులు, ఇతర వాహనాలు తిరిగి క్రాస్ రోడ్డుకు వెళ్లి అక్కడి నుంచి వారి గమ్య స్థానాలకు చేరుకున్నారు. కానీ పట్టణం లోపలి వైపు ఉండే వాహనాలు తిరిగి వెళ్లాలంటే ఖాజీపేటకు వెనక్కి వెళ్లాల్సి రావడంతో ఆ వాహనాలు అక్కడే ఆగిపోయాయి. మధ్యాహ్నం రైల్వే గేటు మరమ్మతులు పూర్తి కావడంతో వాహనదారులు వెళ్లిపోయారు.

రేపు కైలాసనాథేశ్వరాలయంలో కల్యాణం



సిద్దవటం: అయ్యవారురెడ్డి స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నందలూరు(రాజంపేట): టంగుటూరులోని ప్రాచీన శివాలయం కైలాసనాథేశ్వరాలయంలో శివ పార్వతుల కల్యాణం ఈనెల 21న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రికి సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారన్నారు. 22న మధ్యాహ్నం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

అయ్యవారురెడ్డిస్వామికి పూజలు

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామంలో జీవ సమాధి అయిన అయ్యవారురెడ్డి స్వామికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి నాడు శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం అయ్యవారురెడ్డి స్వామిని దర్శించుకుంటారు. భక్తులు స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేసి కాయాకర్పూరాలు అందించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

గండిలో జనసంద్రం

చక్రాయపేట : మహాశివరాత్రి సందర్భంగా పొలతల జాతరకు వెళ్లిన భక్తులతో ఆదివారం గండి పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో పాటు కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పొలతలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వీరంతా తిరుగు ప్రయాణంలో గండికి చేరుకుని అంజన్నను దర్శించుకుంటారని వీరికి ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌లు తగిన ఏర్పాట్లు చేయించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



గండిలో భక్తుల సందడి